సాక్షి పెద్దపల్లి

శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



కల్యాణం.. కమనీయం

కమాన్‌పూర్ : శ్రీఆదివరాహస్వామి ఆలయం శుక్రవారం స్వామివారి మాస కల్యాణోత్సవం వైభవంగా జరిపారు.



ఓసీపీ సందర్శన

గోదావరిఖని: రామగుండం డివిజన్–3లోని ఓసీపీ–1ను ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/17.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులు వచ్చే అవకాశం ఉంది. వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: జిల్లాలో నమోదయ్యే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 124 ఉండగా అందులో 71 కేసులకు డబ్బు చెల్లించారని తెలిపారు. మిగతా కేసుల వ్యవహారాలను తేల్చాలని సూచించారు. సమావేశంలో ఏసీపీలు మహేశ్, తులా శ్రీనివాసరావు, అధికారులు బొంకూరి సుదర్శన్, భాస్కర్, మధునయ్య, రాజ్‌కుమార్, రాజగోపాల్, రాజయ్య, బండి ప్రకాశ్, నాగలైశ్వర్, విజయపాల్‌రెడ్డి, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

ఎంపీవో సరెండర్

రామగిరి(మంథని): విధుల్లో నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగం, ప్రొటోకాల్‌పై అశ్రద్ధ వహించిన ఎంపీవో కాటం భాస్కర్‌ను పంచాయతీరాజ్ డైరెక్టరేట్‌కు సరెండర్ చేశారు. ఈమేరకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. వెంకట్రావుపల్లి ప్రత్యేకాధికారిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో నిబంధనలకు వ్యతిరేకంగా నిధులు ఖర్చు చేశారని, సుమారు రూ.95,55,259 వినియోగించలేదని, అలాగే ఎంపీపీ ఆరెల్లి దేవక్క ప్రొటోకాల్ నిబంధనలు పాటించడం లేదనే ఫిర్యాదు మేరకు భాస్కర్‌ను సరెండర్ చేసినట్లు కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వుల్లో వివరించారు.

12న సదరం స్లాట్ బుకింగ్

ధర్మారం(ధర్మపురి): దివ్యాంగుల వైకల్యం నిర్ధారణ పరీక్షల కోసం ఈనెల 12న ఉదయం 11.30 గంటల నుంచి మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్ శుక్రవారం సూచించారు. కొత్తగా సర్టిఫికెట్ కావాల్సిన వారితోపాటు తాత్కాలిక సర్టిఫికేట్ ఉన్నవారు రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దృష్టిలోపం ఉన్నవారు ఈనెల 15, మార్చి 14వ తేదీలు, మానసిక అంగవైకల్యం ఉన్నవారు ఈనెల 22, మార్చి 21, వినికిడిలోపం ఉన్నవారు ఈనెల 29, మార్చి 28వ తేదీల్లో వైద్యశిబిరాలకు హాజరు కావాలని ఆయన సూచించారు. రసీదుతోపాటు వైకల్యం పరీక్ష కాపీ, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, వ్యక్తిగత మెడికల్ రిపోర్టులు వెంట తీసుకురావాలని ఆయన సూచించారు.

రైతులతో సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమా నాయక్

రామగిరి(మంథని): జాతీయ రహదారి నంబరు 163జీ నిర్మాణం కోసం చేపట్టే భూసేకరణపై మంథని ఆర్డీవో హనుమా నాయక్ శుక్రవారం ఆదివారంపేటలో రైతులతో సమావేశమయ్యారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో అవార్డు విచారణ చేపట్టారు. 2013 చట్టం ప్రకారం నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తామని ఆయన తెలిపారు. రైతులు అడిగిన ప్రశ్నలకు ఆర్డీవో సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్, తహసీల్దార్ రాంచందర్‌రావు, నిర్వాసితులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు 'లక్ష్య' సర్టిఫికెట్




అవార్డు అందుకుంటున్న దయాల్‌సింగ్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)కి గతేడాది జాతీయస్థాయిలో ప్రకటించిన 'లక్ష్య' ప్రొగ్రాంకు ఎంపికైంది. అయితే, శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ నుంచి 'లక్ష్య' అవార్డును జీజీహెచ్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ అందుకున్నారు. కేంద్రప్రభుత్వం ఏటా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించే ఆస్పత్రులను జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులతో తనిఖీ చేయించి మార్కులు కేటాయిస్తోంది. వీటి ఆధారంగా అవార్డులు ప్రకటిస్తూ ప్రోత్సాహకాలు అందిస్తోంది. సహజ ప్రసవాలు, శస్త్రచికిత్సతో ప్రసవాల విభాగాలను మెరుగుపర్చడం కోసం కూడా ప్రోత్సాహకాలు అందిస్తోంది. మూడేళ్ల క్రితం కూడా జీజీహెచ్ 'లక్ష్య'కు ఎంపికయ్యింది. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్, జీజీహెచ్ హెచ్‌డీవో అరుణ, ఆర్‌ఎంవో తిరుమలేశ, జిల్లా క్వాలిటీ మేనేజర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బలగంలేని బహుముఖ ప్రజ్ఞాశాలి

- తెలుగు ఠీవీ.. పీవీ
- మంథని నుంచే రాజకీయ ఓనమాలు
- భారతరత్నతో పులకించిన మంత్రపురి



సాక్షి, పెద్దపల్లి/మంథని: ప్రజలకేమీ తెలియదు.. తెలివితేటలన్నీ ప్రభుత్వం వద్దే ఉన్నాయనుకునే మూస పద్ధతులన్నీ పక్కకుతోసి.. దేశాన్ని ఆర్థికంగా పునర్నిర్మించిన నాయకుడు, భూసంస్కరణల ఆద్యుడు.. ఆర్థిక రంగం నుంచి అణుశక్తి వరకు.. అంతర్గత భద్రత నుంచి విదేశాంగ విధానం వరకు అన్నింటా తనదైన ముద్రవేసిన తెలుగుబిడ్డ పాములపర్తి వెంకటనర్సింహారావు.. 14 భాషలను అనర్గళంగా మాట్లాడే బహుభాషా కోవిదుడు.. రాష్ట్ర, కేంద్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా పదవులకే వెన్నతెచ్చి.. ఆధునిక భారత చరిత్రను మేలు మలుపు తిప్పిన రాజనీతిజ్ఞుడు.. మన మంథని ముద్దుబిడ్డ పీవీ.. ఆయనకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడంపై ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పీవీ అభిమానులు, విద్యావంతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బలగం లేకపోయినా సంప్రదాయ చట్టంలో ఇరుక్కుపోకుండా, నిత్యం కాలనుగుణంగా అప్‌డేట్ అవుతూ, కీర్తికి పొంగక, అవమానాలకు కుంగిపోని మౌనముని పాములపర్తి.

తొలి దక్షిణాది ప్రధాని

1921జూన్ 28న జన్మించిన పీవీ నరసింహారావు పాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరకు చెందిన వారు. అయినా, మంథని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. చదువు పూర్తయ్యాక న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. స్వామీ రామానంద తీర్థ శిష్యరికంలో తొలుత 1952లో కరీంనగర్ పార్లమెంట్ నుంచి పోటీచేసి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి బద్దం ఎల్లారెడ్డి చేతిలో ఓడిపోయారు.

భూ సంస్కరణలు ఆయన చలవే

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పీవీ పనిచేసిన సమయంలో భూ సంస్కరణల చట్టం తీసుకొచ్చారు. భూస్వాముల నుంచి వందలాది ఎకరాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. స్వతహాగా భూస్వామ్య కుటుంభానికి చెందిన పీవీ.. తన వద్ద ఉన్న 1,200 ఎకరాలను వదులుకున్నారు. అడవుల్లో వన్యప్రాణులను చంపడంతో చలించిపోయి.. వాటి సంరక్షకు వన్యప్రాణి సంరక్షణ చట్యం తీసుకొచ్చారు.

1957లో తొలిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తర్వాత 1962, 67, 72లో వరుసగా విజయం సాధించారు. న్యాయ, సమాచార, వైద్య, దేవాదాయ శాఖల మంత్రిగా పనిచేశారు. 1971లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా రెండేళ్లపాటు పనిచేశారు. 1977లో హనుమకొండ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసి కేంద్ర రాజకీయాల్లో అడుగుపెట్టారు.

1980లో హన్మకొండ నుంచే ఎంపీగా గెలుపొందారు. 1984, 1989లో మహారాష్ట్రలోని రాంటెక్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ హయాంలో హోం, రక్షణ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖలు నిర్వర్తించారు. 1991లో ప్రధానమంత్రిగా పదవి చేపట్టి తొలి దక్షిణాది పీఎంగా చరిత్ర సృష్టించారు.

'ఆపరేషన్ బ్లాక్ బోర్డు'తో



పీవీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు(ఫైల్)



మంథనికి గ్యాస్ సౌకర్యం కల్పించాలని పీవీకి విన్నవిస్తున్న పుట్ట మధు తదితరులు(ఫైల్)

1985లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వంలో మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రిగా పీవీ ఉన్నసమయంలో ఆపరేషన్ బ్లాక్‌బోర్డు పేరిట సింగిల్ స్కూల్ టీచర్స్‌ను డబుల్ టీచర్ స్కూల్స్‌గా మార్చారు. అలాగే ప్రతీజిల్లాకో నవోదయ స్కూల్, కేంద్రీయ విద్యాలయం తీసుకొచ్చారు. ఆయన ప్రవేశపెట్టిన విద్యాలయాలు నేడు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు వరంగా మారాయి.

దేశ ప్రగతికి మూలకారకుడు



పీవీ అమలులోకి తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలతోనే మనదేశం ఆర్థిక ప్రగతి సాధించింది. అలాంటి ఆర్థిక నిపుణుడు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న అత్యున్నత పురస్కారం ప్రకటించడం హర్షణీయం. దేశకీర్తిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన మౌనముని. మంథని నుంచి నాలుగుసార్లు శాసనసభకు ఎన్నికైన ప్రజాసేవకుడు.. ఎమ్మెల్యేగా, మంత్రి, ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ఎదగడం సంతోషకరం.

– దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి

వన్నెతెచ్చిన పీవీ



తెలంగాణ బిడ్డ.. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం దక్కడం ఆనందంగా ఉంది. మంథని ఎమ్మెల్యేగా నాలుగుసార్లు గెలిచిన ఆయన.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రిగా, ముఖ్యమంత్రిగా అనేక పదవులు అలంకరించారు. దేశానికే వన్నె తెచ్చారు. పురస్కారం తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు.

– పుట్ట మధు, జిల్లా పరిషత్ చైర్మన్

మంథని పేరు ప్రస్తావిస్తే..

పీవీకి మంథనిపై ఎంతో మమకారం. ఆయనను నాలుగుసార్లు కలిశా. మంథని పేరు ప్రస్తావ వస్తుంటే ఆయన ముఖకలికల్లో పాలపొంగులా కనిపించేది. గోదావరిపై వంతెన, రైల్వేలైన్, ముంబై – వైజాగ్ హైవే, ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణంపై ఆయనతో మాట్లాడినం. మంథని కేంద్రంగా పీవీ స్మారక మానవ వికాస అధ్యయన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి. మంథనిని పీవీ జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలి

–కొండేల మారుతి, పీవీ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు

వేగంగా ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



సర్వే తీరు పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: గృహజ్యోతి, రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేసేందుకు వీలుగా లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియను పారపాట్లు లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. స్థానిక శ్రీరాంనగర్ వార్డులో శుక్రవారం వెరిఫికేషన్ చేస్తున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. క్షేత్రస్థాయి ధ్రువీకరణ పూర్తిచేయాలని, అర్హులందరికీ లబ్ధి చేకూరాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, కౌన్సిలర్ సోనీ, నాయకుడు పాగాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు పెంచాలి..

జిల్లాలో సాధారణ ప్రసవాలు పెంచేలా ఆరోగ్య కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో సాధారణ ప్రసవాల పెంపుపై ఆరోగ్యకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్, వైద్యులతో కలెక్టర్ తన కార్యాలయంలో సమావేశమయ్యారు. శస్త్రచికిత్సల కన్నా సాధారణ ప్రసవాలు పెంచేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులు తీసుకునే ఆహారం, పాటించే నియమాలు, వ్యాయామ సాధన ద్వారా కలిగే ప్రయోజనాలపై వివరించాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, సూపరింటెండెంట్ రమాకాంత్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ కలకలం

పెద్దపల్లిరూరల్: జిల్లా రవాణా శాఖ అధికారి(ఆర్టీఏ) కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు చేస్తున్నారని శుక్రవారం పుకార్లు షికారు చేశాయి. దీంతో మీడియా ప్రతినిధులు కార్యాలయానికి చేరుకున్నారు. కానీ అక్కడ అలాంటి దృశ్యాలేమీ కనిపించలేదు. ఏసీబీ అధికారుల తనిఖీల పుకార్లు స్థానికంగా కలకలం రేపాయి. ఈ పుకార్లతో కార్యాలయ పరిసరాల్లో కనిపించే కొందరు బ్రోకర్లు పత్తా లేకుండా పోయారనే గుసగుసలు వినిపించాయి.

తక్కువ ధరకే వంటగ్యాస్ కనెక్షన్

- బీజేపీ నాయకుడు కాసిపేట లింగయ్య



మాట్లాడుతున్న లింగయ్య

గోదావరిఖని: కేంద్రప్రభుత్వం తక్కువ ధరకే వంట గ్యాస్ కనెక్షన్ అందిస్తోందని, దీనిని ప్రజలు తీసుకుని లబ్ధిపొందేలా చూడాలని బీజేపీ నాయకుడు కాసిపేట లింగయ్య కోరారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ రూ.42వేల కోట్లతో ఐవోసీ కంపెనీకి పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేసే టెండర్ కేటాయించారని తెలిపారు. ఇందులో భాగంగా ఆర్‌ఎఫ్‌సీఎల్ కోసం అక్కడే గ్యాస్ స్టేషన్ ఏర్పాటు చేశారని అన్నారు. అక్కడ నుంచి గోదావరిఖని ప్రాంతంలో ఇంటింటా గ్యాస్ కనెక్షన్ ఇచ్చేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని, ఇప్పటివరకు రూ.600 చార్జి తీసుకుని కనెక్షన్ ఇచ్చారని వివరించారు. కానీ, ప్రస్తుతం రుసుం లేకుండా, ఉచితంగానే కనెక్షన్ మంజూరు చేస్తున్నారని తెలిపారు. కనెక్షన్ కోసం ఇన్‌చార్జి జీవీ సత్యనారాయణ, మొబైల్ నంబరు 99622 71349లో సంప్రదించాలని కోరారు. మరోవైపు.. మున్సిపల్ మేయర్, కమిషనర్ కలిసి గ్యాస్‌పైప్‌లైన్ పనులు ఆపివేయాలని నోటీసు ఇవ్వడం శోచనీయమన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సుమారు 66వేల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, వీటికి సగం ధరకే గ్యాస్ అందుతుందని ఆయన తెలిపారు. రాజకీయాలకు అతీతంగా నాయకులు స్పందించి తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చేయ గ్యాస్ కనెక్షన్ ఇప్పించాలని కోరారు. ఈవిషయంపై కలెక్టర్‌తోపాటు పెట్రోలియం మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రామగిరి ఎంపీడీవో సస్పెన్షన్



ఇనుముల రమేశ్

రామగిరి(మంథని): ప్రొటోకాల్ నిబంధనలు విస్మరించి, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ రామగిరి ఎంపీడీవో ఇనుముల రమేశ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. కమాన్‌పూర్ ఎంపీపీ కార్యాలయానికి సంబంధించిన రమేశ్ డిప్యుటేషన్‌పై రామగిరి ఎంపీపీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే, ప్రభుత్వ కార్యాలయాల్లో పాటించాల్సిన ప్రొటోకాల్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరించారని విచారణలో తేలినట్లు కలెక్టర్ వివరించారు. విధుల్లో గౌరవపూర్వకంగా వ్యవహరించడం లేదని గుర్తించిన ఉన్నతాధికారులు.. తీరు మార్చుకోవాలని హెచ్చరించినా ఈ ఏడాది జనవరి 31న జరిగిన ఓ కార్యక్రమంలో శిలాఫలకంపై ప్రొటోకాల్ పాటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎంపీడీవోపై క్రమశిక్షణ ప్రొసీడింగ్స్ ముగిసేవరకూ సస్పెన్షన్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈసమయంలో తన అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్ వదిలివెళ్లవద్దని కలెక్టర్ తన ఉత్తర్వులో ఆదేశించారు.

బూడిద టెండర్లు రద్దు చేయండి

- ఏజీఎంకు కుందనపల్లి గ్రామస్తుల విన్నపం



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

రామగుండం: ఎన్టీపీసీ బూడిద చెరువులో బూడిద లోడింగ్ పనులకు నిర్వహించిన ఆన్‌లైన్ టెండర్లను రద్దు చేయాలని కుందనపల్లి గ్రామస్తులు శుక్రవారం ఎన్టీపీసీ ఏజీఎంకు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ బూడిద చెరువుతో సమీపంలో ఉన్న ఎన్టీపీసీ నిర్వాసిత కుందనపల్లి గ్రామస్తులు వివిధ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా భూగర్భ జలాల కలుషితం, ఈదురుగాలులతో వెలువడే బూడిద, వాతావరణ కాలుష్యంతో జీవనం దుర్భరంగా మారుతోందన్నారు. ప్రతీ కుటుంబంలో అనారోగ్యం వేధిస్తోందని తెలిపారు. ఈక్రమంలో మానవతా దృక్పథంతో బూడిద లోడింగ్ ఆన్‌లైన్ టెండర్లను రద్దు చేసి పంచాయతీకి బాధ్యతలు అప్పగించాలని కోరారు. తద్వారా వచ్చే ఆదాయంతో తమకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. గ్రామ సంక్షేమానికి ఆ నిధులు వినియోగించుకోవడమే కాకుండా నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు.

కాంట్రాక్టు కార్మికుల శ్రమదోపిడీ



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

- ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ

జ్యోతినగర్(రామగుండం): కేంద్రప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో కాంట్రాక్టు లేబర్ విధానం అన్నిరంగాల్లో కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తోందని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఆరోపించారు. శుక్రవారం ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలపై సమావేశం నిర్వహించారు. ఈనెల 16న చేపట్టే దేశవ్యాప్త కార్మికుల సమ్మె–గ్రామీణ భారత్ బంద్‌పై కార్మికులను సన్నద్ధం చేశారు. కార్మిక నాయకులు మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాస్తూ 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి తీరని ద్రోహం చేసిందని ధ్వజమెత్తారు. అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతన జీవో కాల పరిమితి ముగిసినా సవరించకుండా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని నాయకులు ఆరోపించారు. కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్టీపీసీలో గేట్ పాస్‌ల తనిఖీ జాప్యంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికుల మెడికల్ చెకప్ విధానం ఈఎస్ఐ ఆస్పత్రి ద్వారా కొనసాగించాలని సూచించారు. వేతన ఒప్పందం అమలు ప్రకారం సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

టౌన్ 'ప్లానింగ్'కు ఉద్యోగులు కావలెను..!

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- పేరుకే రామగుండం బల్దియాలో పోస్టింగ్‌లు
- డిప్యుటేషన్‌పై ఇతర మున్సిపాలిటీల్లో విధులు
- రామగుండం నుంచే జీతాలు చెల్లిస్తున్న వైనం
- 16 మంది ఉద్యోగుల్లో ఇక్కడ పనిచేస్తున్నది ఇద్దరే
- ఈ ఇద్దరిలో డిప్యుటేషన్‌పై వచ్చిన టీపీవోపై బదిలీ వేటు
- సెలవులో మరో టీపీఎస్ అధికారి

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో కీలకమైన టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. బల్దియాకు ఆదాయం సమకూరే విభాగాల్లో టౌన్ ప్లానింగ్ అతి కీలకమైంది. అలాంటి విభాగంలో సరిపడా అధికారులు, సిబ్బంది లేరు. ఉన్నతక్కువ మంది కూడా డిప్యుటేషన్‌పై ఇతర మున్సిపాలిటీల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. విచిత్రం ఏమిటంటే.. వారికి రామగుండం బల్దియా వేతనాలు చెల్లిస్తోంది. మొత్తం 16 మంది అధికారులు, ఉద్యోగులు పనిచేయాల్సిన పట్టణ ప్రణాళిక విభాగంలో ప్రస్తుతం ఇద్దరే పనిచేస్తున్నారు. వీరిలో ఇతర మున్సిపాలిటీ నుంచి గతేడాది వచ్చిన టీపీవో తిరుపతమ్మ శుక్రవారం డిప్యుటేషన్ రద్దుపరిచి బదిలీచేశారు. ప్రస్తుతం ఒకరే టీపీఎస్ మిగిలారు. ఆ టీపీఎస్ కూడా సెలవుపై వెళ్లారు. సిబ్బంది కొరతతో సతమతమవుతున్న పట్టణ ప్రణాళిక విభాగం నిర్వహణ పాలకులు, అధికారులకు సవాల్‌గా మారింది.

ఇక్కడ పోస్టింగ్‌లు.. మరోచోట విధులు..

- టౌన్ ప్లానింగ్ విభాగానికి కేటాయించిన 16 మంది అధికారులు, ఉద్యోగుల్లో ఒక్కరే ఇక్కడి బల్దియాలో విధులు నిర్వహిస్తున్నారు.
- దీంతో టౌన్‌ప్లానింగ్ పరిపాలన పూర్తిగా గాడితప్పుతోంది.
- ఇద్దరు ఏసీపీలకు గాను ఒకరినే కేటాయించగా, సదరు ఏసీపీ డిప్యుటేషన్‌పై మరో మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్నారు.
- ఇంకో ఏసీపీ పోస్టులో ఇంకా ఎవరినీ భర్తీలేయలేదు.
- టీపీవో స్థాయి అధికారి కూడా డిప్యుటేషన్‌పై మరో మున్సిపాలిటీలో పని చేస్తున్నారు.
- అలాగే నలుగురు టీపీఎస్‌ల్లో ఒక టీపీఎస్ రామగుండంలో పనిచేస్తుండగా, ప్రస్తుతం ఆ టీపీఎస్ అధికారి సెలవులో ఉన్నారు.
- మిగిలిన ముగ్గురు వివిధ మున్సిపాలిటీల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు.
- వీరందరికీ ప్రతినెలా రామగుండం బల్దియా నుంచే వేతనాలు చెల్లిస్తున్నారు.
- టౌన్‌ప్లానింగ్‌లో ఆరు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్(టీపీబీవో) పోస్టుల్లో ఒక్క పోస్టులో కూడా నియామకం చేపట్టలేదు.
- మరో టౌన్ సర్వేయర్ పోస్టు, టౌన్‌ప్లానింగ్ ట్రేసర్ పోస్టు, క్యాడ్ ఆపరేటర్ పోస్టులూ భర్తీ చేయాల్సి ఉంది.



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

పూర్తికాని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన..

నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్ల నుంచి 2019లో ఎల్‌ఆర్‌ఎస్ కింద 7,061 వరకు దరఖాస్తులను స్వీకరించారు. ఇప్పటివరకు సుమారు నాలుగు వేలకు వరకు మాత్రమే దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యింది. ఇంకో మూడు వేల వరకు పరిశీలన చేయాల్సి ఉంది. టౌన్‌ప్లానింగ్ విభాగంలో అధికారుల కొరతతో ఈ ప్రక్రియకు కూడా ఆటంకాలు ఏర్పడే అవకాలున్నాయి.

పెరుగుతున్న అక్రమ కట్టడాలు..

- అధికారులు, సిబ్బంది కొరతతో బల్దియాలో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి.
- ఇలాంటి ఫిర్యాదులపై యుద్ధప్రాతిపదిన చర్యలు తీసుకోకపోవడంతోనే అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి.
- త్వరలో నిర్వహించే సమ్మక్క–సారలమ్మ జాతరకు ఫ్లెక్సీలు లేకుండా చర్యలు తీసుకోవడానికి అధికారులు లేరు.
- దీనికితోడు ఆర్థిక సంవత్సరం ముగియకముందే హోర్డింగ్‌లు, ఫ్లెక్సీల నుంచి పన్ను వసూలు చేయాల్సి ఉంది.
- ఇంటి నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లో యజమానికి అనుమతి ఇవ్వాలనే నిబంధన ఉంది.
- ఈక్రమంలో టౌన్‌ప్లానింగ్‌లో సిబ్బంది కొరతతో ఇలాంటి జటిలమైన సమస్యలను పరిష్కరించడం పాలకవర్గానికి సవాల్‌గా మారింది.

గతంలోనే లేఖ రాశాం

డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ) ద్వారా టౌన్‌ప్లానింగ్ ఉద్యోగులను నియమిస్తారు. బల్దియాలోని ఆ విభాగంలో ఉన్న ఖాళీలు భర్తీ చేయాలని ఇప్పటికే డీటీసీపీ ఉన్నతాధికారులకు లేఖ రాశాం. ప్రస్తుతం డిప్యుటేషన్లు రద్దు కావడంతో ఇక్కడి పరిస్థితి గురించి మరోసారి వారి దృష్టికి తీసుకెళ్తాం. ప్రస్తుతం ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందిస్తున్నాం.

– నాగేశ్వర్, కమిషనర్, నగరపాలక సంస్థ, రామగుండం

- మరోవైపు.. బల్దియాలోని పట్టణ ప్రణాళిక విభాగం తరచూ అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడం దాని పనితీరుకు అద్దంపడుతోందనే విమర్శలు ఉన్నాయి.

టీపీవో డిప్యుటేషన్ రద్దు

రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న టౌన్ ప్లానింగ్ ఆఫీసర్(టీపీవో) తిరుపతమ్మ డిప్యుటేషన్‌ను ఉన్నతాధికారులు శుక్రవారం రద్దు చేశారు. గతేడాది మే 17న తిరుపతమ్మ డిప్యుటేషన్‌పై రామగుండం కార్పొరేషన్‌కు బదిలీపై వచ్చారు.

క్లుప్తంగా

కాపర్‌వైర్ చోరీ


ధ్వంసమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

సుల్తానాబాద్‌రూరల్: నారాయణపూర్ గ్రామ శివారులోని పంట పొలాల్లో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దొంగలు.. అదులోని కాపర్‌వైర్ చోరీచేశారు. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. ఎస్సై కథనం ప్రకారం.. ఎల్లమ్మగుడి వద్ద గల వ్యవసాయ పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. తన పొలానికి నీళ్లు పెట్టేందుకు రైతు తిరుపతి శుక్రవారం ఉదయం వెళ్లాడు. అయితే, విద్యుత్ లేకపోవడంతో టాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూశాడు. అది ధ్వంసమై కనిపించింది. వెంటనే విద్యుత్ అధికారులకు సమచారం ఇచ్చాడు. ఏఈ శంకర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు 30కిలోల కాపర్‌వైరు చోరీకి గురైందని, దానివిలువ దాదాపు రూ.30వేలు ఉంటుందని తెలిపారు. దీనిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఈ వివరించారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): చిన్నలింగాపూర్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు మహిళలను గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. జగిత్యాల జిల్లాకు చెందిన ముగ్గురు మహిళలు అనాథ ఆశ్రమం పేరుతో గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ చందాలు వసూలు చేశారు. అనుమానం వచ్చిన గ్రామస్తులు గట్టిగా ప్రశ్నించడతో నీళ్లు నమిలారు. దీంతో డయల్ 100కు కాల్ చేయడంతో పోలీసులు గ్రామానికి చేరుకుని మహిళలను ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆటోలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వివాహితను కాపాడిన ఎస్సై

బోయినపల్లి(చొప్పదండి): అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకునేందకు ప్రయత్నించిన మండలంలోని వెంకట్రావుపల్లికి చెందిన వివాహితను ఎస్సై శ్రీకాంత్ రక్షించారు. వెంకట్రావుపల్లికి చెందిన వివాహితకు అప్పులు ఎక్కువ కావడంతో ఎలా తీర్చాలో తెలియక మిడ్‌మానేరు ప్రాజెక్టులో ఆత్మహత్య చేసుకునేందుకు గురువారం రాత్రి తన కూతురిని తీసుకుని వెళ్లింది. గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్ వివాహితను రక్షించి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యకు పాల్పడవద్దని కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ఎస్సై వివరించారు.

వివాహిత అదృశ్యం

ముస్తాబాద్(సిరిసిల్ల): మొర్రాయిపల్లెకు చెందిన వివాహిత పల్లె పద్మ(34) అదృశ్యమైందని ఎస్సై శేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ నెల 8 నుంచి పద్మ కనిపించకుండా పోయిందని ఆమె కుటుంబీకులు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

కరీంనగర్‌క్రైం: మంకమ్మతోటలో ఓ వ్యభిచారగృహంపై పోలీసులు దాడి చేశారు. మంకమ్మతోటలోని ఓ మహిళ ఇతర ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహిస్తోంది. పక్కా సమాచారంతో పోలీసులు శుక్రవారం ఆ ఇంటిపై దాడి చేశారు. నిర్వాహకురాలు, ఓ విటుడు, అమ్మాయిలను సరఫరా చేస్తున్న వ్యక్తితో పాటు ఇంటి యజమానిపై కేసు నమోదు చేశారు.

ఆ'గని' ప్రమాదాలపై సీరియస్

- అధికారులు సైతం బాధ్యత వహించాల్సిందే
- రామగుండంలో పెరుగుతున్న ప్రమాదాలపై దృష్టి
- ఏరియాల వారీగా సమీక్ష సమావేశాలు

✦ గతనెల 22న జీడీకే–2ఏ గనిలో టబ్‌ల లింక్ ఊడి బలంగా ఢీకొట్టడంతో మైనింగ్ సర్దార్ మందాడి సమ్మిరెడ్డి తీవ్రగాయాలతో గతనెల 28న మృతి చెందారు.

✦ కొద్దిరోజులుగా సీరియస్, రిపోర్టబుల్ ప్రమాదాలు పెరుగుతున్నాయి.

✦ ఈనాలుగు నెలలు ఓసీపీల్లో ఉత్పత్తి కీలకం. ఉత్పత్తితో పాటు రక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈక్రమంలో రక్షణ చర్యలపై యాజమాన్యం దృష్టి సారించింది.

గోదావరిఖని: బొగ్గు గనుల్లో ఆ'గని' ప్రమాదాలపై సింగరేణి యాజమాన్యం సీరియస్‌గా ఉంది. ప్రధానంగా రామగుండం రీజియన్‌లో ఇటీవల చోటుచేసుకుంటున్న యాక్సిడెంట్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈక్రమంలో కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య నాలుగురోజులపాటు రామగుండం రీజియన్‌లో పర్యటించారు. ఏరియాల వారీగా ప్రత్యేక రక్షణ సమీక్ష సమావేశాలు నిర్వహించారు. భూగర్భ గనుల్లో ప్రమాదాలు పెరగడంపై సీరియస్ అయ్యారు. ప్రమాదాల తీరు, ఉద్యోగుల వైఫల్యాలపై లోతుగా విశ్లేషణ చేశారు. రక్షణపై నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనికి అధికారులు సైతం బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. జీడీకే–2ఏ గనిలో టబ్బుల లింక్ ఊడిపోయి కిందిసైడ్ వేగంగా వెళ్లి అక్కడ ఉన్న మైనింగ్ సర్దార్ మందాడి సమ్మిరెడ్డిని బలంగా ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలై వారం పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గతంలో భూగర్భ గనుల్లో రూఫ్‌ఫాల్, సైడ్‌ఫాల్ అయి మృతి చెందిన సంఘటనలు అనేకం జరిగేవి. వాటి విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుండటంతో ఇలాంటి ప్రమాదాలు గణనీయంగా తగ్గిపోయాయి. కానీ, కొత్త తరహా, కొత్తకోణంలో చోటుచేసుకుంటున్న ప్రమాదాలపై కార్మికులు భయాందోళనకు గురవుతున్నారు.

ఎస్‌వోపీ, సీవోపీపై ప్రత్యేక దృష్టి

- సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌వోపీ), కోడ్ ఆఫ్ ప్రాక్టీస్(సీవోపీ) అమలుపై యాజమాన్యం దృష్టి సారించింది.
- ఈవిషయంలో ప్రత్యేక శిక్షణ తరగతులు సైతం ప్రతినెలా కొనసాగుతున్నాయి.
- గనిలోని పనిప్రదేశాల్లో ప్రమాదాలు జరగకుండా ఎస్‌వోపీ విధానం చేపట్టాల్సి ఉంటుంది.
- అలాగే కోడ్ ఆఫ్ ప్రాక్టీస్ ప్రకారం గనుల్లో బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించిన సమయంలో వచ్చే ప్రమాదాలను ముందుగానే పసిగట్టి రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.
- ఇలా ముందుకు సాగితే ప్రమాదాలు రహిత సింగరేణిగా తీర్చి దిద్దవచ్చని రెండు విధానాలను రూపొందించారు.


సమీక్ష నిర్వహిస్తున్న కార్పొరేట్ సేఫ్టీ జీఎం

గనిప్రమాదంపై విచారణ

టబ్బులు ఢీకొని మైనింగ్ సర్దార్ మందాడి సమ్మిరెడ్డి మృతి చెందిన సంఘటనపై యాజమాన్యం శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. అలాగే బొగ్గు తీసుకొచ్చే టబ్బుల లింక్ ఊడిపోకుండా అదనపు లాకింగ్ సిస్టం ఉంటుంది. టబ్బులు జాయింట్ చేసే క్రమంలో లాక్ వేయడం మర్చిపోయారా? లేక కుదుపులకు జాయింట్ ఊడిపోయిందా? అనే విషయం తేలాల్సి ఉంది.

ప్రమాదాల్లేని సింగరేణి లక్ష్యం

ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సమష్టిగా ముందుకు సాగాలి. ప్రతీరోజు విధులు ప్రారంభించిన సమయంలోనే రక్షణ ప్రతిజ్ఞ చేయాలి. దాన్నివిధులు పూర్తయ్యేంత వరకూ గుర్తుంచుకోవాలి. సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్, కోడ్ ఆఫ్ ప్రాక్టీస్ పూర్తిస్థాయిలో అమలు చేయాలి. పనికి సిద్ధమైయ్యే క్రమంలో అక్కడ ఏర్పడే ప్రమాదాలను ముందే పసిగట్టి చర్యలు తీసుకుంటే చాలా వరకు ప్రమాదాలు నివారించవచ్చు.

– కె.గురువయ్య, కార్పొరేట్ సేఫ్టీ జీఎం

బొగ్గు బాయి వార్తలు

ఉత్పత్తి లక్ష్య సాధనపై దృష్టి

- ఏరియా రక్షణ అధికారి బచ్చ రవీందర్

గోదావరిఖని: వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ఆర్జీ–2 ఏరియా అగ్రగామిగా నిలవాలని ఏరియా రక్షణ అధికారి బచ్చ రవీందర్ కోరారు. శుక్రవారం ఓసీపీ–3 బేస్ వర్క్‌షాప్, షావల్స్ అండ్ డ్రిల్ సెక్షన్‌లో మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం, రాబోయే ఏడాదిలో తీయాల్సి బొగ్గు ఉత్పత్తిపై ప్రణాళిక బద్ధగా ముందుకు సాగాలన్నారు. ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. భారీ యంత్రాలను సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రోజువారీగా పనిగంటలు పెంచి బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని పేర్కొన్నారు. ఈసందర్భంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ స్థితిగతులను వివరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జిగురు రవీందర్, ప్రాజెక్టు అధికారి మధుసూదన్, కమిటీ సభ్యులు రాజేంద్రప్రసాద్, మురళీకృష్ణ, వెంకటరామచంద్ర, రాజాజీ, రామకృష్ణ, జనార్దన్, రాంకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

యంత్రాల వినియోగం పెంచాలి

- ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి(మంథని): భూగర్భ గనుల్లోకన్నా ఏపీఏ గనిలో అత్యుత్తమ సాంకేతికత యంత్రాలు ఉన్నాయని, వాటిని వినియోగం పెంచి నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని జీఎం కె.వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం ఆర్జీ–3 పరిధిలోని ఏపీఏలో మల్టీ డిపార్ట్ మెంటల్ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా జీఎం మాట్లాడారు. వార్షిక లక్ష్యాలను అధిగమించడం కోసం నాణ్యత, ప్రామాణాలు పాటించాలన్నారు. ఇదేసమయంలో భద్రతతో కూడిన విధులు నిర్వర్తించాలన్నారు. సంస్థ నిర్దేశిత 77 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం సంస్థ అభివృద్ధికి చేపట్టాల్సిన సలహాలు, సూచనలను అధికారుల నుంచి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, ఏరియా ఇంజినీర్ సీతారామం, ఎస్‌వోటూ జీఎం బైద్య, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ఏరియా సేఫ్టీ అధికారి వెంకటరమణ, ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వరరావు, ఫీట్ సెక్రటరీలు గంగాధర్, కొమురయ్య పాల్గొన్నారు.

వేసవిలో విద్యుత్ అవసరాలు అధికం


మాట్లాడుతున్న కోల్‌మూమెంట్ ఈడీ అల్విన్

గోదావరిఖని: రాబోయే వేసవిలో విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాధ్యమైనంత బొగ్గు ఉత్పత్తి చేయాలని కోల్ మూమెంట్ ఈడీ ఆల్విన్ కోరారు. శుక్రవారం ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ రంగంలో బొగ్గు కీలకపాత్ర పోషిస్తోందన్నారు. సింగరేణి గనుల్లో ఉత్పత్తి చేసిన బొగ్గు అధికశాతం విద్యుత్ పరిశ్రమలకే సరఫరా చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ పరిశ్రమల యాజమాన్యాల అభ్యర్థన మేరకు సింగరేణి సంస్థ నుంచి సాధ్యమైనంత అధిక బొగ్గు ఉత్పత్తి చేయాలని సూచించారు. త్వరితగతిన బొగ్గు రవాణా చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్జీ–1, 2 జీఎంలు చింతల శ్రీనివాస్, ఎల్‌వీ సూర్యనారాయణ, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, చిలక శ్రీనివాస్, సైదులు, ఎన్‌వీరావు, మదన్‌మోహన్, సురేందర్‌రాజ్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న చేపట్టిన దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. స్థానిక ప్రెస్‌భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేయడం, ఇతర హక్కులు హరించడాన్ని నిరసిస్తూ సమ్మె చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, ప్రకాశ్, వైవీరావు, ఎల్లయ్య, వీరభద్రయ్య, సమ్మయ్య, రాజారత్నం, జిగురు రవీందర్, బుర్ర తిరుపతి, అన్నారావు, మహేందర్, రవి కుమార్, సాగర్, సంపత్‌రెడ్డి, రమేశ్, ఈశ్వర్‌రెడ్డి, మహేందర్, రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీతారామయ్య

వినియోగదారుల విశ్వాసం పొందాలి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: వినియోగదారుల విశ్వాసాన్ని చూరగొనేందుకు నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా ప్రతీఒక్కరు పనిచేయాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ కోరారు. శుక్రవారం జీడీకే–5 ఓసీపీలో ఏర్పాటు చేసిన మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంకితభావం, సమష్టి కృషితో ఉత్పత్తి పెంచాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తిపై దృష్టి సారించాలని, తద్వారా సంస్థ లాభాల బాటలో పయనిస్తుందని తెలిపారు. భూగర్భ గనుల్లో యంత్రాల వినియోగం పెంచితే కంపెనీ వ్యయం తగ్గి లాభాలు చేకూరుతాయన్నారు. ప్రస్తుతం ఉత్పాదకత వ్యయం కన్నా ఉత్పత్తి వ్యయం అధికంగా ఉందన్నారు. అధికారులు లక్ష్మీనారాయణ, రాంమూర్తి, ఆంజనేయులు, అమరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, ఎన్‌వీరావు, రామస్వామి, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ ప్రభుదాస్ పాల్గొన్నారు.



ఆస్పత్రే.. కానీ పశువులది కాదు..

ఇది జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి. పర్యవేక్షణ కొరవడడంతో ఆస్పత్రి ఆవరణలో పశువులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పేషెంట్లు, వారి సంబంధీకులే కాదు.. వైద్యసిబ్బంది, వైద్యులకూ ఇబ్బందిగా మారింది. కొన్నిసార్లు కుక్కలు సిబ్బంది, పేషెంట్లను కరిచిన సందర్భాలూ ఉన్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

వలస కార్మికులను స్వస్థలాలకు పంపించాలి


కార్మికుల నుంచి వివరాలు సేకరిస్తున్న అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కోటేశ్వర్లు

రామగిరి(మంథని): ఇటుక బట్టీల్లోని వలస కార్మికులను తమ స్వస్థలాలకు పంపించాలని జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కోటేశ్వర్లు ఆదేశాలు జారీ చేశారు. ఇటుక బట్టీల యాజ మాని సోదరుడు విష్ణు.. వలస కార్మికులపై దాడిచేశారని ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కార్మికులపై దాడి విషయం తెలుసుకున్న లేబర్, రెవెన్యూ అధికారులు, పోలీసులు శుక్రవారం ఇటుక బట్టీల వద్ద విచారణ జరిపారు. ఇటుక బట్టీల్లో సౌకర్యాలు, వేతనాల గురించి కార్మికులను అడిగి తెలుసుకున్నారు. తమపై దాడి చేస్తున్నారని, తమను స్వస్థలాలకు పంపిచాలని కార్మికులు వేడుకున్నారు. వెంటనే వారిని స్వస్థలాలకు పంపించాలని అధికారులు సూచించారు. అయితే, యాజమానులు ఈమేరకు హామీ ఇవ్వడంతో వలస కార్మికులకు విముక్తి లభించనున్నది. గోదావరిఖని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మెరుగు శ్రీకాంత్, ఎస్సై కటికె రవిప్రసాద్, డెప్యూటీ తహసీల్దార్ రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా 'గృహజ్యోతి' సర్వే

సుల్తానాబాద్(పెద్దపల్లి): గృహజ్యోతి, రాయితీపై వంటగ్యాస్ పథకాల కోసం అర్హులను గుర్తించే ప్రక్రియలో పట్టణాల్లో ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు శుక్రవారం సర్వే ప్రారంభించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి తెల్ల రేషన్‌కార్డు, విద్యుత్ మీటరు నంబరు, ఆధార్‌కార్డు, మొబైల్ నంబరు సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన వివరాలను ప్రభుత్వం రూపొందించిన పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ఇంటి యజమానులతోపాటు అద్దెకు ఉండే వారి నుంచి కూడా ఆధార్, ఫోన్‌నంబరు, రేషన్ కార్డు జిరాక్స్‌లు తీసుకుంటున్నారు.


వివరాలు సేకరిస్తున్న అధికారులు

వివరాలు ఇవ్వండి

సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు తమ ఇళ్లకు వచ్చే సిబ్బందికి వివరాలు అందివ్వాలి. అందుబాటులో లేకుంటే సబ్ ఇంజినీర్, అకౌంట్ ఆఫీసర్ కార్యాలయాలకుకు వెళ్లి వివరాలు సమర్పించాలి.

– సుదర్శనం, ఎస్ఈ, ట్రాన్స్‌కో

మా ఇంటికి వచ్చారు



మా ఇంటికి వచ్చిన విద్యుత్ సిబ్బందికి మా వివరాలు సమర్పించా. రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచితంగా అందియయు విద్యుత్‌ను సద్వినియోగం చేసుకుంటాం.

– ముస్త్యాల రవీందర్, స్థానికుడు, సుల్తానాబాద్

పోటీ పరీక్షల మెటీరియల్ అందుబాటులో ఉంచాలి

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల్లోని శాఖ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు అవసరమయ్యే మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ కోరారు. శుక్రవారం జిల్లా గ్రంథాయల సంస్థ సర్వసభ్యసమావేశం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అధ్యక్షతన శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగింది. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో యువతకు ఉపయోగపడేలా అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వార్షిక అంచనాలపై చర్చించి పద్దుల వారీగా ఆదాయ, వ్యయాలపై చర్చించి ఆమోదించారు. లైబ్రరీ సెస్ వివరాలపై ఆరా తీశారు. బకాయి ఉన్న సెస్‌ను వీలైనంత త్వరగా లైబ్రరీకి జమచేయాలని డీపీవో చంద్రమౌళిని ఆదేశించారు. మున్సిపాలిటీల నుంచి రావాల్సిన మొత్తం కోసం ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌కు లేఖ రాయాలని సూచించారు. డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మాణాలు చేపట్టిన లైబ్రరీల పనులను వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలన్నారు. సమావేశంలో లైబ్రరీ సభ్యులు రాజు, డీపీవో చంద్రమౌళి, డీఈవో మాధవి, డీపీఆర్వో ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖని: తమ సమస్యలు పరిష్కరించాలని సింగరేణి అధికారుల సంఘం నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక ఎస్‌సీవోఏ క్లబ్‌లో సమావేశమైయ్యారు. ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన ప్రతినిధుల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో ఏరియా అధ్యక్షుడు సుంకర మధుసూదన్, సింగరేణి బ్రాంచ్ జనరల్ సెక్రటరీ పెద్ది నర్సింహులు, వైస్ ప్రెసిడెంట్–1, 2 పాల నరేశ్, ఎం.జనార్దన్, ఏరియా సెక్రటరీ ఎర్రం వెంకటరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకం


వెంకటరమణ

గోదావరిఖని: మంచిర్యాల జిల్లా చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ ప్రభారిగా గోదావరిఖనికి చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు క్యాతం వెంకటరమణను నియమించారు. శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లి రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని వెంకటరమణ అన్నారు. తన నియామకంపై పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్ క్యాబిన్‌ను ఢీకొట్టిన లారీ



జ్యోతినగర్(రామగుండం): స్థానిక బీ– పవర్ హౌస్ సమీపంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రాజీవ్ రహదారిపై ఓ లారీ ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటుచేసిన క్యాబిన్‌ను శుక్రవారం ఢీకొంది. పెద్దపల్లి వైపు నుంచి గోదావరిఖని వైపు వస్తున్న లారీ మూలమలుపు వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఉంచిన క్యాబిన్‌ను ఢీకొంది. దీంతో క్యాబిన్ ధ్వంసమైంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పినట్లయ్యింది. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం. ఎన్టీపీసీ పోలీసులు ప్రమాదస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.





ఆకట్టుకున్న బొమ్మల కొలువు

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా లేడీస్‌క్లబ్ ఆధ్వర్యంలో యైటింక్లయిన్‌కాలనీ ఎస్‌సీవోఏ క్లబ్‌లో శుక్రవారం లేడీస్‌క్లబ్ అధ్యక్షురాలు మాలతి ఆధ్వర్యంలో బొమ్మలకొలువు ఘనంగా నిర్వహించారు. సంస్థ సీ అండ్ ఎండీ సతీమణి శారద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డైరెక్టర్ సతీమణి కల్యాణి హాజరయ్యారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్, కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య, ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ పాల్గొన్నారు.